క్లుప్తంగా

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి బి కాలనీ వద్ద నూతనంగా నిర్మించిన షిర్డీ సాయిబాబా ఆలయం, పాలరాతి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయ నిర్మాణానికి కృషి చేసిన మత గురువు అల్తాఫ్‌రజా, ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కూటమి నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



నూజివీడు: పట్టణానికి వచ్చే ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు వైఎస్సార్ సీపీ నాయకుడు, ఉదయగిరి చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ ఉదయగిరి కృపారావు నేతృత్వంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలోని శ్రీనివాసా సెంటర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ప్రతాప్ అప్పారావు ప్రారంభించి మాట్లాడారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వర రావు, కౌన్సిలర్ కొడవటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

170 మందికి వైద్య పరీక్షలు



తిరువూరు: సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో పెనుగొలనులో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డెంటల్, షుగర్, బీపీ, ఎముకలు, చిన్నపిల్లలకు జనరల్ వ్యాధులకు సంబంధించి 170 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. సాయిబాబా కమిటీ సభ్యులు జి. నరసింహారావు, ఎస్ హనుమంతరావు, వి. వెంకటరెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సామరస్య పూర్వకంగా ఉత్సవాలు జరుపుకోవాలి



ముసునూరు: సామరస్య పూర్వక వాతావరణంలో అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు నిర్వహించాలని నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ సూచించారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ముసునూరు, చింతలవల్లి, కొర్లగుంట శివారు సింహాద్రి అప్పారావుపేట గ్రామాల్లో జరుగుతున్న ఉత్సవాల ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలు సామరస్య పూర్వక వాతావరణంలో జరిగేలా సహకరించాలన్నారు. ఎస్ఐ ఎం.చిరంజీవి, ఏఎస్ఐ ఫణి భూషణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు వితరణ

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహం పైడూరుపాడు గ్రామంలో ఏర్పాటు చేసేందుకు విగ్రహ కమిటీ సభ్యులకు కొటికలపూడి సర్పంచి, వైఎస్సార్ సీపీ ఇబ్రహీంపట్నం మండల కన్వీనర్ రెంటపల్లి నాగరాజు రూ.5 వేలు అందజేశారు. పైడూరుపాడుకు చెందిన అంబేడ్కర్ విగ్రహ కమిటీ సభ్యులు పెయ్యల వెంకటేశ్వరరావు, పలువురు యువకులు ఆదివారం సర్పంచి నాగరాజును మర్యాద పూర్వకంగా కలిశారు.

అప్రమత్తత ముఖ్యం

- వేసవిలో అగ్ని ప్రమాదాలు అధికం
- నివారణకు ప్రజల్లో అవగాహన
- నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు

నూజివీడు: వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలు అధికం. వీటి నివారణకు అగ్నిమాపక సిబ్బంది ప్రతి ఏడాది అగ్నిమాపక వారోత్సవాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. స్కూళ్లు, కళాశాలలు, పరిశ్రమలు, గృహాలు, బహుళ అంతస్తుల భవనాలు, వాణిజ్య సముదాయాల్లో అగ్ని ప్రమాదాల నియంత్రణపై ప్రధానంగా దృష్టి సారించారు. ఈ తరహా భవన సముదాయాల్లో ఉండే వారికి అవగాహన కల్పించడమే లక్ష్యంగా కార్యక్రమాలు ఉంటాయి. వారోత్సవాల్లో అగ్ని ప్రమాదాలు, జాగ్రత్తలపై ప్రజలకు అధికారులు మాక్ డ్రిల్ ద్వారా అవగాహన కల్పిస్తారు.

సేఫ్టీ పరికరాలపై దృష్టి

అగ్ని ప్రమాదాలు జరుగకుండా ప్రజలు ఎలా అప్రమత్తంగా ఉండాలి, ప్రమాదవశాత్తు మంటలు చెలరేగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పిస్తారు. ప్రతి ఫైర్‌స్టేషన్ పరిధిలోని స్కూళ్లు, కళాశాలలు, పరిశ్రమలు, గృహాలు, బహుళ అంతస్తుల భవనాలు, వాణిజ్య సముదాయాల్లో ఫైర్ సేఫ్టీ పరికరాలు సక్రమంగా ఉన్నాయా? లేదా? అనే అంశంపై ఆడిటింగ్ చేయడంతో పాటు ఆయా యాజమాన్యాలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తారు.



నూజివీడులోని అగ్నిమాపక కేంద్రం

గత మూడేళ్లలో ఇలా..

నూజివీడు అగ్నిమాపక కేంద్రం పరిధిలో నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు మండలాలున్నాయి. వీటిల్లో ఆగిరిపల్లి మండలం కృష్ణవరం నూజివీడు ఫైర్‌స్టేషన్ నుంచి 35 కిలోమీటర్ల దూరంలో ఉంది. గత మూడేళ్లలో నూజివీడు ఫైర్ స్టేషన్ పరిధిలో 248 అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోగా రూ.2.25 కోట్ల ఆస్తి నష్టం వాటిల్లింది. రూ.1.10 కోట్ల ఆస్తిని కాపాడారు.

ఒక్క వాహనమే దిక్కు

నూజివీడు పట్టణం, నూజివీడు, ముసునూరు, ఆగిరిపల్లి మండలాలు కలిపి విస్తీర్ణం అధికంగా ఉన్నప్పటికీ ఒక్క వాహనమే దిక్కుగా మారింది. గత పదేళ్లుగా రెండో అగ్నిమాపక వాహనం కోసం అధికారులు పలుమార్లు ప్రతిపాదనలు పంపినా మరో వాహనాన్ని మాత్రం ఇవ్వడం లేదు. దీంతో దూరంగా ఉన్న ప్రాంతానికి ఈ వాహనం వెళ్లేసరికి బూడిదే మిగులుతోంది. ఏడాదికి 70కి పైగానే అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ కేంద్రంలో మొత్తం 16 మంది సిబ్బంది పనిచేయాల్సి ఉండగా పది మంది మాత్రమే పనిచేస్తున్నారు.

గత మూడేళ్లలో అగ్నిప్రమాదాల వివరాలు

సంవత్సరం	ప్రమాదాల సంఖ్య	జరిగిన నష్టం (రూ.కోట్లలో)	కాపాడిన ఆస్తి విలువ (రూ.లక్షల్లో)
2022-23	96	1.01	45
2023-24	78	0.34	30
2024-25	74	0.70	35
మొత్తం	248	2.05	1.10 కోట్లు

సూచనలు పాటించాలి



అగ్ని ప్రమాదాలు జరుగకుండా ప్రజలందరూ అప్రమత్తతతో ఉండాలి. ఇంటికి తాళం వేసి ఊరు వెళ్తుంటే కరెంట్ మెయిన్ ఆఫ్ చేసుకుంటే మంచిది. చిన్నపాటి అలసత్వంతోనే ఊహించని స్థాయిలో నష్టం వాటిల్లుతుంది. మేము చెప్పిన సూచనలు పాటించడం ద్వారా విలువైన ఆస్తులు, ప్రాణాలు కాపాడుకోవచ్చు.

– డి. మత్తయ్య, అగ్నిమాపక శాఖాధికారి, నూజివీడు

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ముసునూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని రమణక్కపేట జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం పీవీఎస్ రామకృష్ణారావు అన్నారు. రమణక్కపేటలో హైస్కూల్ ఉపాధ్యాయులు 2025-26 విద్యా సంవత్సరంలో బాలలను చేర్చుకునేందుకు ఆదివారం ఇంటింటికీ ప్రచారం నిర్వహించి, బడి ఈడు పిల్లలను గుర్తించారు. హెచ్ఎం మాట్లాడుతూ రమణక్కపేట జెడ్పీ హైస్కూల్లో అన్ని సౌకర్యాలతో ఉచితంగా, నాణ్యమైన విద్యను బోధిస్తున్నందున స్థానిక విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, కొండయ్య, రామారావు, సుజాత, షకీలా, దుర్గాభవాని, అనూరాధ, ప్రియదర్శిని, కాశీ అన్నపూర్ణ పాల్గొన్నారు.



ఇంటింటా ప్రచారం చేస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

మారెమ్మకు ప్రత్యేక పూజలు

పుట్రేల (విస్సన్నపేట): పుట్రేల గ్రామంలోని మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పొంగళ్లు, నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. అన్నసమారాధన నిర్వహించారు.

కరపత్రాల ఆవిష్కరణ

తిరువూరు: జన విజ్ఞాన వేదిక ప్రతి ఏటా ఉచిత వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని ఎంఈఓ శ్యాంసుందరరావు అన్నారు. స్థానిక మండల విద్యా కేంద్రంలో ఆదివారం జేవీవీ రూపొందించిన వేసవి శిక్షణ శిబిరం కరపత్రాలను ఎంఈఓ ఆవిష్కరించి మాట్లాడారు. స్పోకెన్ ఇంగ్లిష్, జనరల్ సైన్స్, మ్యాథ్స్, మేజిక్ షోలలో శిక్షణ ఇస్తామని, ఈనెల 28న తిరువూరులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శిక్షణ ప్రారంభం అవుతుందని జేవీవీ మండల అధ్యక్షుడు ఎం. సుధాకర్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం



ముసునూరులో ప్రార్థనలు చేస్తున్న జోసఫ్ తంబి తదితరులు



మట్టల ఆదివారం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

ఆగిరిపల్లి: మండలంలోని కనసానపల్లి పరిశుద్ధ పౌలు సీఎస్ఐ చర్చిలో మట్టల ఆదివారాన్ని క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. రెవరెండ్ ఫాదర్ ఐజాక్ జాన్ ఆధ్వర్యంలో సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం చిన్నారులు, పెద్దలు ఈత మట్టలతో గీతాలు ఆలపిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

- **ముసునూరు:** ముసునూరు ఆర్‌సీఎం విచారణ గురువు రెవ.ఫాదర్ జోసఫ్ తంబి మట్టల ఆదివారం ప్రాధాన్యతను వివరించారు. ముసునూరు, రమణక్కపేట, కాట్రేనిపాడు, లోపూడి, చింతలవల్లి, వలసపల్లి, వేల్పుచర్లల్లోని ఆర్‌సీఎం చర్చిల విశ్వాసులు వీధుల్లో ఊరేగింపులు, ర్యాలీలు నిర్వహించారు.

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్

నేడు అంబేడ్కర్ జయంతి

జి.కొండూరు: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించేందుకు పలు పార్టీలు, ప్రజాసంఘాలు, దళిత సంఘాలు ఏర్పాట్లు చేస్తున్నారు. బాబా సాహెబ్ అంబేడ్కర్ 1891 ఏప్రిల్ 14న జన్మించారు. గ్రాడ్యుయేషన్ పూర్తయ్యాక బరోడా ఇన్‌స్టిట్యూట్‌లో చేరారు. అనంతరం పై చదువుల కోసం లండన్ వెళ్లారు. న్యాయశాస్త్రాన్ని అభ్యసించేందుకు గ్రేస్ ఇన్‌లో చేరారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్‌లో డిగ్రీని పూర్తి చేశారు. జర్మనీలోని బాన్ యూనివర్సిటీలో కొంతకాలం చదువుకున్నారు.

అణగారిన వర్గాల సంక్షేమం కోసం సంఘం..

అనంతరం 1924లో ఇంగ్లండ్ నుంచి తిరిగి వచ్చిన తరువాత అణగారిన వర్గాల సంక్షేమం కోసం ఒక సంఘాన్ని ప్రారంభించారు. దీనికి సర్ చిమన్‌లాల్ సెతల్వాడ్ అధ్యక్షుడిగా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చైర్మన్‌గా ఉన్నారు. విద్యను వ్యాప్తి చేయడం, ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడం, అణగారిన వర్గాల వివక్షను దూరం చేయడం ఈ సంఘం ప్రధాన లక్ష్యాలుగా ఉండేవి.

రాజ్యాంగ ముసాయిదా కమిటీ చైర్మన్‌గా..

స్వాతంత్ర్యం అనంతరం 1947లో భారతదేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ తొలి మంత్రి వర్గంలో న్యాయ శాఖ మంత్రిగా అంబేడ్కర్ నియమితులయ్యారు. ఆ తర్వాత కొద్ది రోజులకే భారత గణతంత్ర రాజ్యానికి రాజ్యాంగ ముసాయిదా కమిటీ చైర్మన్‌గా నియమితులయ్యారు. భారత రాజ్యాంగ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రధానంగా సమానత్వం, సామాజిక న్యాయం, అంటరానితనం నిర్మూలన వంటి దళితుల హక్కుల కోసం పోరాడారు. అంబేడ్కర్ సేవలు, ఆయన గొప్పతనాన్ని భారత ప్రజలు ప్రతి సందర్భంలోనూ చర్చించుకుంటున్నారు.

ఇంటర్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

విస్సన్నపేట: ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో మండలంలోని కొండపర్వ ఆంధ్రప్రదేశ్ గిరిజన బాలికల గురుకుల కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ జి. ప్రసన్న ఆదివారం తెలిపారు. బైపీసీ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో పి. రేణుక 978 మార్కులు, బి. లలితాంజలి 972, కె. శైలజ 968, టి. మౌనిక 960 మార్కులు సాధించారన్నారు. ద్వితీయ సంవత్సర ఎంపీసీలో జేసీ బిజారమ్మ 960 మార్కులు, జేపీ బిజారమ్మ 942 మార్కులు, మొదటి సంవత్సరం బైపీసీ కేకే చరిష్మా 431 మార్కులు, బి. రిషిత 423, ఎంపీసీలో కె. సాయి 444, టి.లక్ష్మి 440 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ వివరించారు. విద్యార్థులను అభినందించారు.

ధాన్యం కొనుగోలు చేయకుంటే మిల్లులు సీజ్



జగ్గయ్యపేట: ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని మిల్లర్లు కొనుగోలు చేయకుంటే మిల్లులు సీజ్ చేస్తామని ఇన్‌చార్జి తహసీల్దార్ మనోహర్ హెచ్చరించారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ధరకు మిల్లర్లు ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. గ్రేడ్-1 రకం రూ.1,725లకు ధర నిర్ణయించినట్లు తెలిపారు. మార్కెట్ యార్డు అధికారులు ఇచ్చిన సర్టిఫికెట్ కాకుండా మిల్లర్లు తేమశాతం ఎక్కువ ఉందని ఆంక్షలు పెడుతుండటంతో ప్రభుత్వ ధర లభించక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండలంలో పద్మావతి, వెంకటేశ్వర రైస్ మిల్లులు ప్రభుత్వం నిర్ణయించిన ధరకే కొనుగోలు చేయాలని, లేకుంటే మిల్లులు సీజ్ చేస్తామని వాటి యాజమాన్యాలను హెచ్చరించారు. అనంతరం రైతులు పలు సమస్యలను ఆయనకు వివరించగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. పీడీఎస్ డీటీ వెంకటేశ్వరరావు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

క్రీస్తు రాజుకు జయం..జయం



ఇబ్రహీంపట్నంలో మట్టల ఆదివారం ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు



తిరువూరులో ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ప్రదర్శన



జి.కొండూరులో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు



మైలవరం ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న ఫాదర్ అనిల్ ఫ్రాన్సిస్, ఫాదర్ జయరాజు

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం

తిరువూరు/మైలవరం/నూజివీడు: తిరువూరు, మైలవరం, నూజివీడు నియోజకవర్గాల్లో మట్టల ఆదివారాన్ని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈత ఆకులకు వివిధ రకాల పూలను అలంకరించి వాటిని చేబూని పలుచోట్ల ప్రదర్శనలు నిర్వహించారు. రాజాధిరాజు, క్రీస్తురాజుకు జయం..జయం అంటూ నినాదాలు చేశారు. క్రీస్తు గీతాలు ఆలపిస్తూ ప్రదర్శన సాగింది. చర్చిలు, మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

- **ఇబ్రహీంపట్నం:** ఇబ్రహీంపట్నం ఆర్‌సీఎం విచారణ చర్చిలో ఫాదర్ బెల్లంకొండ అనిల్‌బాస్కో ప్రార్థనలు జరిపారు. ఏసుక్రీస్తు చూపిన మార్గంలో నడుచుకోవాలని సూచించారు.
- **తిరువూరు:** తిరువూరు ఆర్‌సీఎం చర్చి నుంచి పట్టణ వీధుల్లో ఫాదర్ జంగం విజయకుమార్ ఆధ్వర్యంలో స్తుతి గీతాలు ఆలపిస్తూ క్రైస్తవులు ప్రదర్శన నిర్వహించారు. తిరువూరు టౌన్ సీఎస్ఐ చర్చిలో ప్రార్థనల అనంతరం ప్రదర్శన నిర్వహించారు. పట్టణంలోని చర్చిల్లో ప్రార్థనలు జరిగాయి.
- **జి.కొండూరు:** జి.కొండూరు సీఎస్ఐ చర్చి పాస్టర్ రెవరెండ్ ఎం.జాన్ కోటేశ్వరరావు, ఆర్‌సీఎం చర్చి ఫాదర్ మేడేపల్లి థామస్, బైబిల్ మిషన్ ఆధ్వర్యంలో క్రైస్తవ భక్తులు ఈతాకు కొమ్మలను వివిధ రకాల పువ్వులతో అలంకరించి ర్యాలీని నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.
- **విస్సన్నపేట:** విస్సన్నపేటలో వివిధ చర్చిల ఆధ్వర్యంలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ పరసా భూషణం, సంఘస్తుల ఆధ్వర్యంలో ప్రధాన రహదారిలో కీర్తనలు ఆలపిస్తూ మట్టలతో ప్రదర్శన నిర్వహించారు.
- **మైలవరం:** మైలవరం ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ రెవరెండ్ కె. అనిల్ ఫ్రాన్సిస్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మైలవరం శాంతి నగర్‌లో క్రీస్తు విశ్వాసులు కొబ్బరి మట్టలు, ఈత కొమ్మలు చేతపట్టుకుని ప్రదర్శన నిర్వహించారు. రెవరెండ్ ఫాదర్ జయరాజు, లిటిల్ ఫ్లవర్ కాన్వెంట్ సిస్టర్స్, ఉపదేశకులు, దీక్షాపరులు, మరియ దళం సభ్యులు, విశ్వాసులు పాల్గొన్నారు.
- **నూజివీడు:** పట్టణంలోని ఎల్ఎఎఫ్ చర్చి నేతృత్వంలో ఆదివారం మట్టల ఆదివారాన్ని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈత మట్టలు పట్టుకొని హోసన్నా జయం అంటూ పట్టణంలోని ప్రధాన వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. చర్చి ఆవరణను ఈత ఆకులతో అలంకరించారు. ఎల్ఎఫ్ చర్చి పాస్టర్ బండి ఐజాక్, క్రైస్తవులు పాల్గొన్నారు.
- **చాట్రాయి:** మట్టల ఆదివారాన్ని మండలంలోని క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. క్రైస్తవులు మట్టలకు పూలు గుచ్చి గ్రామాల్లో ఊరేగింపు చేశారు. ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.



నూజివీడులో మట్టల ఆదివారం సందర్భంగా ప్రదర్శన చేస్తున్న క్రైస్తవులు



చనుబండలో ప్రదర్శన నిర్వహిస్తున్న క్రైస్తవులు